క్లుప్తంగా

వరద బాధితులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

వైఎస్సార్ సీపీ వేమూరు ఇన్‌చార్జి అశోక్‌బాబు

వేమూరు: కృష్ణానది వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ నేతలతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పరిస్థితులను వైఎస్ జగన్ దృష్టికి అశోక్‌బాబు తీసుకెళ్లారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని 24 గ్రామాలు వరదల వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. పంటలు పాడైపోయాయని చెప్పారు. రైతులను, కౌలు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని వివరించారు.

విద్యార్థులకు యోగా శిక్షణ



భట్టిప్రోలు: దివ్య బాబాజీ ఫౌండేషన్ (భీమవరం) ఆధ్వర్యంలో భట్టిప్రోలులో టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ నిర్వాహకులు ఎ.ఉమాదేవి, ఎ.సీతారామరాజు, జీజీ ప్రసాద్ విద్యార్థులతో ఆసనాలు వేయించారు. క్రమం తప్పకుండా అభ్యసన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23లోపు ఈ-పంట నమోదు చేయించుకోవాలి



వేమూరు: రైతులు, కౌలు రైతులు ఈనెల 23వ తేదీ లోపు పంట నమోదు చేయించుకోవాలని రేపల్లె సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) ఆర్.విజయబాబు తెలిపారు. వేమూరు మండలంలోని పెనుమర్రు, పెరవలిపాలెం, చావలి గ్రామాల్లో పర్యటించారు. చావలి రైతు సేవా కేంద్రంలో పంట నమోదు, ఈకేవైసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె సబ్ డివిజన్‌లోని రైతులందరూ పంటలను నమోదు చేయించుకోవాలని, రైతు సేవా కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. ఈకేవైసీ కూడా చేయించు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో విలేజ్ వ్యవసాయ సహాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువులు

తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు అని 16వ వార్డు కౌన్సిలర్ దివి అనిత పేర్కొన్నారు. మలేరియాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చినరావూరు తోట, వైకుంఠపురం కాలనీలో వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. చిన్న దోమ పెనుప్రమాదమని, అవికుడితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. శుక్రవారం రోజు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల రామప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారుల ఆదరణతో బ్యాంకు పురోగమనం

తెనాలి: ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ, తెనాలి 23 వసంతాలుగా సభ్యులు, ఖాతాదారుల ఆదరణతో పురోగమిస్తోందని సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు వెల్లడించారు. సొసైటీ ఆధ్వర్యంలో ది కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రస్తుతం 10 శాఖలతో నడుస్తూ 2023-24 సంవత్సరానికి రూ.533 కోట్ల టర్నోవర్‌తో రూ.2.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు చెప్పారు. ఈనెల 22వ తేదీన సర్వసభ్య సమావేశం సందర్భంగా శుక్రవారం సొసైటీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మొత్తం డిపాజిట్లు రూ.117 కోట్లు కాగా, రుణాలు రూ.114 కోట్లు ఉన్నట్టు తెలిపారు. తనఖా రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలను ఇస్తుండగా, డిపాజిట్లపై జాతీయ బ్యాంకులకన్నా అత్యధికంగా డిపాజిట్లపై 11 శాతం వడ్డీని అందిస్తున్నామని తెలిపా రు. బంగారు రుణాలపై 13 శాతం, ఇళ్లు, ఇళ్లస్థలాల హామీపై, వ్యక్తిగత జామీనుపై 15 శాతం వడ్డీతో రుణాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. రికవరీలో అగ్రగామిగా ఉండటం గర్వకారణమన్నారు.

హామీలు హుష్‌కాకి

- మరిచిపోయిన కూటమి ఎమ్మెల్యేలు
- రేపల్లెలో అమలుకు శ్రద్ధ చూపని మంత్రి అనగాని
- బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలదీ అదే బాట
- ప్రజల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం

సూపర్ సిక్స్ పథకాలకు సీఎం చంద్రబాబు మంగళం పాడినట్టే.. బాపట్ల, వేమూరు, రేపల్లెల్లో ఎన్నికైన కూటమి ఎమ్మెల్యేలూ తమ హామీలకు తూట్లు పొడుస్తున్నారు. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మంత్రి అయినా స్థానిక సమస్యలపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే గత ప్రభుత్వంలో ప్రగతికి పడిన బాటలు ఇప్పుడు ప్రశ్నార్థకమయ్యాయి. –రేపల్లె రూరల్/బాపట్ల/వేమూరు



రేపల్లె పట్టణంలో సమస్యగా ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

అ'సత్య' హామీలేనా!



ఎన్నికల సమయంలో నిజాంపట్నంలో హామీలు గుప్పిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ (ఫైల్)

ఎన్నికల ముందు రేపల్లె కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గంలో ఊరూరా తిరిగి సూపర్ సిక్స్ హామీలను ఊదరగొట్టారు. స్థానిక సమస్యలనూ పరిష్కరించేస్తానని ప్రగల్భాలు పలికారు. తీరా గెలిచి మంత్రి అయ్యి వందరోజులైనా హామీల అమలు ముందుకు కదల్లేదు. దీనికోసం కనీస చర్యలూ చేపట్టలేదు. అసలు వాటి ప్రస్తావనే చేయడం లేదు. దీంతో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనగాని సత్యప్రసాద్ రేపల్లె నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. మంత్రి అయిన తర్వాత ఆయన రేపల్లె వచ్చిన సందర్భాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు.

అనగాని ఇచ్చిన హామీలు ఇవే..

- రేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల వైద్యశాలగా అప్‌గ్రేడ్
- రేపల్లె మున్సిపాలిటీలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఆధునికీకరణ
- మున్సిపాలిటీకి ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్ ఏర్పాటు
- నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల అభివృద్ధి
- చివరి ఆయకట్టుకూ సాగునీరు అందించే విధంగా పలుచోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ల నిర్మాణం
- తీరప్రాంత గ్రామాలలో అత్యాధునిక తుఫాను షెల్టర్ల నిర్మాణం.

(వీటిల్లో ఏ హామీ గురించి ప్రస్తుతం మంత్రి మాట్లాడడం లేదు.)

ప్రధాన సమస్యలు

- రేపల్లె జగనన్న కాలనీలో రహదారుల నిర్మాణం, ఇంటింటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ల ఏర్పాటు.
- పట్టణంలో స్థలం ఉన్నా నిర్మాణానికి నోచుకోని గ్రంథాలయ భవనం.
- అధ్వానంగా మారిన పార్కుల అభివృద్ధి

(వీటిల్లో ఏ సమస్యనూ మంత్రి పట్టించుకోవడం లేదు)

నరేంద్రవర్మ.. మర్మం

బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ గెలిచి వంద రోజులైనా ఇప్పటివరకు ఇచ్చిన హామీలపై పెదవి విప్పడం లేదు. దీని మర్మమేమిటో అంతుబట్టక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ముందు వర్మ సూర్యలంక బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. గెలిచాక ఆ ఊసే మరిచారు. ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టినా దీనికి సంబంధించి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు శూన్యం. కనీసం గత ప్రభుత్వంలో అమలైన విద్యుత్ సబ్సిడీపైనా నోరుమెదపడం లేదు. గిట్టుబాటు ధరల కల్పనపైనా ప్రకటన లేదు. గత ప్రభుత్వంలో బాపట్ల జిల్లా కేంద్రమైంది. పట్టణంలో రోడ్ల విస్తరణకు బీజం పడింది. రూ.550 కోట్లతో మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనులు ముందుకు కదలకపోగా ఆగిపోయే దుస్థితి నెలకొంది. మెడికల్ కళాశాల మనుగడే ప్రశ్నార్థకమైంది. బాపట్ల ఏరియా వైద్యశాల అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.3కోట్లకు పైగా ఖర్చు పెట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక సరైన వైద్యసేవలు అందడం లేదు.

మాట నిలుపుకోని నక్కా

లంక గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఇప్పుడు ఆ విషయమే మరిచిపోయారు. వరదల సమయంలోనూ ప్రజలను ఆదుకోలేకపోయారు. వరదలకు కకావికలమైన లంకల పూర్వవైభవానికి తీసుకున్న చర్యలు శూన్యం.

సూపర్ సిక్స్ హామీలకు ప్రభుత్వం మంగళం

వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు ధ్వజం



వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి

భట్టిప్రోలు: ఎన్నికల ముందు ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు ఇప్పుడు ప్రభుత్వం మంగళం పాడిందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు నోరు మెదపడం లేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని సీఎంతోపాటు మంత్రులూ బీదార్పులు అరుస్తున్నారని మండిపడ్డారు. బాబు షూ్యరిటీ అని పలికిన ప్రగల్భాలు ఇప్పుడు ఏమయ్యాయని నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగినవే చెప్పారని.. గత ప్రభుత్వంలో ఆయన చెప్పిన దానికంటే ఎక్కువ చేసి చూపించారని గుర్తుచేశారు. చేయలేనివాటిని చెప్పి ప్రజలను మోసం చేయలేదని పేర్కొన్నారు. అన్నివిధాలా విఫలమైన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని అశోక్‌బాబు ఎద్దేవా చేశారు.

మెరుగైన పాలనే ప్రభుత్వ లక్ష్యం

బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు



వెల్లటూరులో ఇంటి గోడపై స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



గోకరాజు నల్లిబోయినవారిపాలెంలో బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం)/భట్టిప్రోలు/వేమూరు: మెరుగైన పాలనే ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలు నరేంద్రవర్మరాజు, నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులైన సందర్భంగా పిట్టలవానిపాలెం మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు అధికారులతో కలిసి ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బకూటి మాధవరావు, ఆర్డీవో జి.రవీందర్, తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీఓ మారుతీశేషమాంబ పాల్గొన్నారు.

- భట్టిప్రోలు మండలం వెల్లటూరులో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థానిక ఎస్టీ కాలనీలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో జనసేన వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఊసా రాజేష్, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, రేపల్లె ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, సర్పంచ్ బొజ్జా రవి, ఎంపీటీసీ సభ్యులు వాకా వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- వేమూరు మండలంలోని అబ్బనగూవల్లి, చంపాడు, చుండూరు మండలంలోని మున్నంగి వారిపాలెం, అంబేడ్కర్ నగర్లలో గ్రామ సభలు తూతూమంత్రంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో వేమూరు మండల ప్రత్యేకాధికారి విలియం, గ్రామ సర్పంచ్ రాంబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ, చొప్పర్ శేఖర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ఎం స్కూల్లో ప్రారంభమైన క్రీడల పోటీలు

తెనాలిఅర్బన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన క్రీడల పోటీలను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసూనదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం త్రోబాల్, పరుగు పందెం, జంపింగ్ వంటి పోటీలను నిర్వహించారు. 25 మంది వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగే పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు చెప్పా రు. శనివారం వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించనున్న ట్లు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెనాలి మండల కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఎస్.నాగిరెడ్డి, పీఈటీలు రవీంద్ర, భాస్కర్, రమేష్, హరనాథ్, శివశంకర్, గోవింద్, గోవర్ధన్, నాగమణి, హెప్సిబా పాల్గొన్నారు.



త్రోబాల్ గేమ్‌ను పరిశీలిస్తున్న నిర్వాహకులు



పరుగు పందెంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం



నిజాంపట్నం: స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దటంతో గ్రామంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడవులదీవి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పలు స్వచ్ఛత కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, అప్పుడే స్వచ్ఛగ్రామంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపదార్థాలను తడిచెత్త-పొడిచెత్తగా వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని, లేకుంటే నిర్దేశిత ప్రాంతంలో పడవేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు చెత్త బుట్టలను అందజేశారు. గ్రామంలో రహదారిని పరిశుభ్రపరచి, బ్లీచింగ్ చల్లించారు. అధికారులు, సిబ్బంది గ్రామంలో పారిశుద్ధ్య పరిరక్షణపై నిరంతరం గ్రామస్తులను చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆలిన్, వార్డు మెంబర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్నార్ ఒక నటవిశ్వవిద్యాలయం

ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో మా-ఏపీ అధ్యక్షుడు దిలీప్‌రాజా



తెనాలి: ప్రముఖ సినీనటుడు నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని మా-ఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలపాటి నగర్‌లోని రత్న ఫార్ట్యూన్ కల్యాణమండపంలో జరిగిన వేడుకలకు మా-ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. ఆ మహానటుడిపై శతజయంతి రోజున పోస్టల్ స్టాంపు విడుదలపై హర్షం ప్రకటించారు. ప్రతి పాత్రకు ప్రాణం పోసిన మహానటుడు అక్కినేని నాగేశ్వరరావని ఆయన కొనియాడారు. నటనలో అక్కినేని ఒక నట విశ్వవిద్యాలయంగా ఆయన అభివర్ణించారు. తాగుబోతులను, ప్రేమలో ఓడిపోయిన వ్యక్తులను దేవదాసుగా కొందరు నేటికీ అంటున్నారంటే, ఆపాత్రలో అక్కినేని నటన ఎవరెస్ట్ అంత ఎత్తులోను, మహా సముద్రమంత వైశాల్యంలో ఉండటమే కారణమన్నారు .దేవదాసు,ప్రేమాభిషేకం, మాయాబజార్, మేఘసందేశం సినిమాలు తెలుగు చలనచిత్ర సీమలో చెరగని ఆస్తి అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన పర్సనాలిటీకి తగిన పాత్రలనే ఎంపిక చేసుకొని ఆయా పాత్రలకు నూరు శాతం న్యాయం చేసినందునే అక్కినేనిని పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు వరించాయని చెప్పారు. దర్శకుడు రత్నాకర్, నటుడు వెలగా సుభాష్ చంద్రబోస్, మిలటరీ ప్రసాద్,రావూరి సురేష్ బాబు, బెల్లంకొండ వెంకట్, కొండముడి జయకర్, డాక్టర్ భూషణం , రమణయ్య, బసవయ్య పాల్గొన్నారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మళ్లీ ఇరుక్కుపోయిన లారీ!



తెనాలిఅర్బన్: వైకుంఠపురం రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. మిక్సర్ లారీ బ్రిడ్జికి వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లకు తగలడంతో వాహనం నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ సుమారు గంటపాటు నిలిచిపోయింది. వివరాలోకి వెళితే తెనాలి నుంచి పెదరావూరు వైపు మిక్సర్ లారీ వెళ్తుంది. వైకుంఠపురం బ్రిడ్జి దాటగానే ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్ల కంటే లారీ ఎత్తుగా ఉండటంతో డ్రైవర్ వాహనాన్ని నిలిపివేశారు. ఇంతలో వెనుక నుంచి అనేక వాహనాలు వచ్చి అక్కడ నిలిచిపోయాయి. మిక్సర్ లారీ ముందుకు వెనుక వెళ్ళ లేక అక్కడే నిలిచిపోయింది. దీంతో చాలాసేపు ఈ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది.

పూరిల్లు దగ్ధం



కొల్లూరు : అగ్ని ప్రమాదం సంభవించి ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని రావికంపాడులో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చెరుకూరి చార్లెస్ భార్య తమ గృహంలో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగసిపడి పూరింటికి అంటుకున్నాయి. మంటలు ఇల్లు మొత్తం వ్యాపించటంతో చార్లెస్ భార్య కట్టుబట్టలతో బయటకు వచ్చి చుట్టుపక్కల వారిని సహాయం కోసం పిలవడంతో వారు అప్రమత్తమై మంటలను అదుపుచేశారు. అప్పటికే గృహం మొత్తం మంటలు వ్యాపించి సామగ్రి మొత్తం దగ్ధం అవడంతో సుమారు రూ.50 వేలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలి



బాపట్ల: పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అఖిలభారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ పేర్కొన్నారు. సంఘం కార్యాలయం నుంచి శుక్రవారం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మేకల ప్రసాద్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించటంలో ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ పట్టణ కార్యదర్శి మువ్వల పల్లవి, పీఓడబ్ల్యూ డివిజన్ కార్యదర్శి జె.కల్పన, పీఓడబ్ల్యూ మండల అధ్యక్షులు కొండా అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.